సాక్షి నిజామాబాద్

బుధవారం। 5। ఫిబ్రవరి। 2025

ఆలయంలో భక్తుల సందడి



రథోత్సవంలో మహిళల కోలాటం



న్యూస్‌రీల్

మందులు అందుబాటులో ఉంచాలి : కలెక్టర్



ఎడపల్లి (బోధన్): ఎడపల్లి మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు మంగళవారం తనిఖీ చేశారు. అందుబాటులో ఉన్న వైద్య సదుపాయాలను పరిశీలించారు. రక్త పరీక్షలు, రోగులకు అందిస్తున్న చికిత్స వివరాలు తెలుసుకున్నారు. గర్భిణులకు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు నిర్వహించాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. వైద్య సిబ్బంది స్థానికంగా ఉంటూ రోగులకు మెరుగైన వైద్య సేవలందించాలని ఆదేశించారు.

అర్బన్ హెల్త్ సెంటర్ తనిఖీ

ఆర్మూర్‌టౌన్: ఆర్మూర్ పట్టణంలోని అర్బన్ హెల్త్ సెంటర్‌ను డీఎంహెచ్‌వో రాజశ్రీ మంగళవారం తనిఖీ చేశారు. వ్యాక్సినేషన్, మెడిసిన్ స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఆమె వెంట మెడికల్ ఆఫీసర్ ఫాతిమా ఫిర్దౌస్, డాక్టర్ ప్రవీణ్, ఆనంద్, ఎల్‌టీ కృష్ణ, సురేశ్ తదితరులున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌నాగారం: భారత ప్రభుత్వం, కేంద్ర యువజన క్రీడా మంత్రిత్వ శాఖ ప్రతి సంవత్సరం నిర్వహించే అంతర్ జిల్లాల యువ ఎక్స్ఛేంజ్ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లో నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్‌వైకే కోఆర్డినేటర్ శైలి బెల్లాల్ ఒక ప్రకటనలో తెలిపారు. నిపుణుల పర్యవేక్షణలో ఈనెల 11 నుంచి 15 వరకు ఉమ్మడి జిల్లాకు చెందిన యువతీయువకులకు నైపుణ్య శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. శిక్షణలో పాల్గొనే ఆసక్తి ఉన్న వారు తమ వివరాలను 91004 35410 నంబర్‌కు వాట్సాప్ చేయాలని సూచించారు. ఎంపికైన 25 మందికి మాత్రమే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

క్యాన్సర్‌పై అవగాహన ఉండాలి



నిజామాబాద్‌నాగారం: ప్రతి ఒక్కరూ క్యాన్సర్‌పై అవగాహన కలిగి ఉండాలని ఐఎంఏ అధ్యక్షుడు అజ్జ శ్రీనివాస్ సూచించారు. ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కేంద్రంలోని పితామహ క్యాన్సర్ ఆస్పత్రిలో ప్రపంచ క్యాన్సర్ డే నిర్వహించారు. క్యాన్సర్ వైద్య నిపుణులు చైతన్య, ఐఎంఏ ప్రధాన కార్యదర్శి విక్రమ్‌రెడ్డి, కోశాధికారి రాజేందర్ సూరినీడు, వైద్యులు శ్రీశైలం, ఆకుల విశాల్, అర్చన, వినోద్‌కుమార్‌గుప్తా, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసుల సత్తా



ఖలీల్‌వాడి: కరీంనగర్‌లో నిర్వహించిన 3వ తెలంగాణ స్టేట్ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్‌లో జిల్లా పోలీసులు సత్తా చాటారు. బాసర జోన్–2 తరఫున వివిధ క్రీడాంశాల్లో 61 మంది పాల్గొని 26 పతకాలు సాధించారు. పతకాలు సాధించిన పోలీస్ క్రీడాకారులను ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ మంగళవారం అభినందించారు. పతకాలు సాధించిన వారిలో డి సాయికృష్ణ(బోధన్ పీఎస్), ఎండీ అఫ్సర్(రుద్రూర్ పీఎస్), కె నరేశ్‌కుమార్(సీసీఎస్), బి నరేందర్(బోధన్ రూరల్ పీఎస్), ఎండీ హైమద్(ఏఆర్ హెడ్ క్వార్టర్స్), ఏ స్టానిలేబినోయ్ (ఐదో టౌన్), మోర్తాడ్, ఆర్మూర్, షీటీమ్, బోధన్‌టౌన్, కోటగిరికి చెందిన రామ్‌కుమార్, ఎం గణేశ్, నారాయణ, ఏ శ్రీకాంత్, కె గంగాప్రసాద్, ఏ అరుణ్‌కుమార్ ఉన్నారు. మహిళా విభాగంలో ఏఆర్ హెడ్‌క్వార్టర్‌కు చెందిన ఆర్ ధరణి, ఎస్ నిఖిత, ఎం విజయలక్ష్మి, షీటీమ్‌కు చెందిన పి రేఖరాణి పతకాలు సాధించారు. క్రీడల్లో ఉత్తమ ప్రతిభకనబర్చిన వారికి ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ప్రశంసాపత్రాలు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) జి బస్వారెడ్డి, అడిషనల్ డీసీపీ(ఏఆర్) కె రామ్‌చందర్‌రావు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ శ్రీనివాసరావు, రిజర్వ్ సీఐ హెచ్ సతీశ్(అడ్మిన్) తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠా.. నమోనమః

- నయనానందకరంగా సాగిన రథోత్సవం
- పెద్ద సంఖ్యలో హాజరైన భక్తులు
- మారుమోగిన శివనామస్మరణ



నగరంలో శ్రీ నీలకంఠేశ్వర స్వామి రథం ఊరేగింపు



ఉత్సవ మూర్తులను రథంపైకి చేర్చుతున్న పూజారి

నిజామాబాద్ రూరల్: హరహర మహాదేవ శంభో శంకరా.. నీలకంఠా నమోనమః అంటూ భక్తుల శివనామస్మరణతో ఇందూరు కంఠాభరణమైన శ్రీ నీలకంఠేశ్వర స్వామి రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. రథ సప్తమిని పురస్కరించుకుని నీలకంఠేశ్వర స్వామి పార్వతీ సమేతుడై భక్తులకు దర్శనమిచ్చాడు. మంగళవారం నగరంలో జరిగిన రథోత్సవానికి పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు. ఊరేగింపులో దారి పొడవునా మహిళలు మంగళ హారతులతో స్వామి వారికి స్వాగతం పలికారు. భక్తు లు తమ కోరికలను తీర్చమని వేడుకుంటూ రథానికి తొట్టెలు కట్టారు. ముందుగా మేళతాళాలతో రథంపై స్వామి వారి ఉత్సవ మూర్తులను ప్రతిష్ఠించారు. భక్తి గేయాలు, కోలాటాలు, భజనలతో ఆధ్యాత్మిక వాతావరణం ఏర్పడింది. వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య శివపార్వతుల విగ్రహాల రథాన్ని ఊరేగించారు. రథానికి ఆలయ ప్రధాన అర్చకులు సుహాస్ మకరంద్ పూజలు చేశారు.

తల్లి గోరీ వద్ద ప్రత్యేక పూజలు..

ఆలయాన్ని చెక్కిన శిల్పికి, అతని తల్లికి రథసప్తమి నాడు దర్శనం ఇస్తామని శివపార్వతులు వాగ్దానం చేసినట్లు ఆలయ చరిత్ర చెబుతోంది. ఆలయానికి కూత వేటు దూరంలో ఉన్న తల్లిగోరీ వద్దకు ఆనవాయితీ ప్రకారం రథోత్సవం సాగింది. శిల్పితల్లి గోరీకి అర్చకులు పూజలు నిర్వహించారు. శివపార్వతుల ఆశీస్సులను తల్లి గుడికి ఆశీర్వాద పూర్వకంగా అక్షింతలను సమర్పించారు. అనంతరం రథోత్సవం తిరిగి ఆలయం వరకు సాగింది. బుధవారం చక్రతీర్థం నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు తెలిపారు.



వస్తువులు కొనుగోళ్లు చేస్తున్న మహిళలు

పెండింగ్ బిల్లులు.. తీరని కష్టాలు

- ఏడాదిగా జీతం తప్ప అన్ని బిల్లులూ పెండింగ్
- తీవ్ర ఆందోళన చెందుతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు
- ఉద్యోగ విరమణ పొందినా అందని బెనిఫిట్స్



నిజామాబాద్‌అర్బన్: రాష్ట్రంలో దశాబ్దకాలంగా అభివృద్ధేతర వ్యయం పెరగడంతో ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో అందాల్సిన బిల్లులు రాక తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏడాదికాలంగా ఉద్యోగుల సరెండర్‌లీవ్, మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లులు, టీఎస్ జీఎల్‌ఐ క్లెయిమ్‌లు, జనరల్ ప్రావిడెంట్ ఫండ్ పెండింగ్‌లో ఉన్నాయి. మరో పక్క ఉద్యోగ విరమణ చెందిన విశ్రాంతి ఉద్యోగులకు గత మార్చి నుంచి రావాల్సిన బెనిఫిట్స్ రావడం లేదు. రాష్ట్ర ఖజానాలో తగినంత నిధులు లేకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగులకు బిల్లుల కోసం నిరీక్షణ తప్పడం లేదు. అత్యవసరాల కోసం దరఖాస్తు చేసుకున్న ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఆర్థిక అవసరాలు తీరక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఉద్యోగుల బిల్లులన్నీ..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గత డిసెంబర్ నాటికి రాష్ట్రంలో డీటీఏ పరిధిలో 3,32,670 బిల్లులకు సంబంధించి రూ.4908 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలోని డీటీవో పరిధిలో దాదాపుగా రూ.145 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఒక జీపీఎఫ్‌కు సంబంధించిన బిల్లులే రూ. 45 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఆరోగ్య సమస్యలతో అత్యవసర శస్త్రచికిత్సలు చేసుకున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ బిల్లుల కోసం గత ఏడాదికాలంగా ఎదురుచూస్తున్నారు. మెడికల్ రీయింబర్స్‌మెంట్ బిల్లుల అప్రూవల్ కోసం 3 నుంచి 6 నెలలు ఎదురుచూస్తే, వాటి క్లెయిమ్‌ల కోసం ఏడాదిపాటు ఎదురుచూడాల్సి వస్తోంది. అలాగే ఉద్యోగ, ఉపాధ్యాయులకు సరెండర్ లీవ్, టీఎస్ జీఎల్‌ఐ లోన్లు కూడా ఏడాదికాలంగా రావడం లేదు. మరో పక్క 2024 మార్చి నుంచి 2024 డిసెంబర్ వరకు జిల్లాలో 154 మంది విశ్రాంత ఉపాధ్యాయులకు సంబంధించి ఎటువంటి బెనిఫిట్స్ రాలేదు. అలాగే జిల్లాలో పదవీ విరమణ పొందిన ఉద్యోగులు ఇంకా 150 మంది వరకు ఉంటారు. వారికి రావాల్సిన బెనిఫిట్స్ కోసం గత ఆరు నెలలుగా ఎదురు చూస్తున్నారు.

ఎందుకింత జాప్యం

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అధికారంలోకి వచ్చిన గత ప్రభుత్వం బిల్లుల చెల్లింపు కోసం ఇంటిగ్రేటెడ్ ఫైనాన్స్ మేనేజ్‌మెంట్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ తీసుకువచ్చింది. చెల్లించవలసిన బిల్లులను డైరెక్టర్ ఆఫ్ ట్రెజరీ అకౌంట్స్ చెల్లిస్తుంది. రాష్ట్ర ప్రభుత్వానికి నెలనెలా వస్తున్న ఆదాయంలో నుంచి తప్పని సరిగా చెల్లించాల్సిన జీతభత్యాలు, పింఛన్లు, పాత బాకీలకు అసలు, వడ్డీల చెల్లింపులు, సంక్షేమ పథకాల రాయితీలకు తొలుత నిధులను విడుదల చేసింది. ఇంకా అభివృద్ధి పనులకు ప్రాధాన్య క్రమంలో ఇస్తుంది. ఇవన్నీ దాటుకుని పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలంటే నిధుల కొరత ఏర్పడుతోంది. ఆదాయం అంచనాలకు తగినంత రాక అభివృద్ధేతర వ్యయం పెరగడంతో ఉద్యోగ ఉపాధ్యాయులకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదు.

అనేక ఇబ్బందులు..

ఉద్యోగ, ఉపాధ్యాయులు గృహ నిర్మాణం, పిల్లల చదువులు, వివాహాలు, ఆరోగ్య సమస్యలు తదితర అవసరాల నిమిత్తం దరఖాస్తు చేసుకున్న సరెండర్ లీవ్, టీఎస్ జీఎల్‌ఐ రుణాలు, జీపీఎఫ్ లోన్లు, ఫార్ట్‌ఫైనల్ సొమ్ములు ఏడాది కాలంగా పెండింగ్‌లో ఉన్నాయి. దీంతో వీరికి ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. అలాగే పదవీ విరమణ పొందిన ఉద్యోగ, ఉపాధ్యాయులు తమ బెనిఫిట్స్ రాక ఆవేదన చెందుతున్నారు. గ్రూప్ ఇన్సూరెన్స్, గ్రాట్యుటీ, సరెండర్ లీవులు తదితర రుపేణా ఇవ్వాల్సిన సొమ్ము రాక వారికి బయట తెచ్చిన అప్పులకు వడ్డీల భారం పెరుగుతున్నది.

విడతల వారీగా అయినా చెల్లించాలి..



జీపీఎఫ్ మెడికల్ సరెండర్ లీవ్‌కు సంబంధించిన బిల్లులు గత రెండేళ్లుగా పెండింగ్‌లో ఉన్నాయి. మొత్తం ఒక్కసారి కాకుండా విడతల వారీగా అయినా ఉద్యోగ, ఉపాధ్యాయులకు బిల్లులు చెల్లించాలి. – ఎస్‌పీ కృష్ణారెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు

సకాలంలో అందిస్తే మేలు..



ఉద్యోగ, ఉపాధ్యాయులకు సకాలంలో బిల్లులు అందిస్తే ఎంతో మేలు. వీటిపై పిల్లల చదువులు, ఇతరాత్ర అవసరాలు ఆధారపడి ఉంటాయి. దీనికోసం ఉద్యోగులు ఎంతగానో ఎదురుచూస్తారు. అందువల్ల సకాలంలో అందించి ఉద్యోగుల ఇబ్బందులను తీర్చాలి. – పెద్దోళ్ల నాగరాజు, టీఎన్జీవోస్ అసోసియేట్ అధ్యక్షుడు

పెండింగ్ లేకుండా చూడాలి..



ఉద్యోగులకు రావాల్సిన బెనిఫిట్స్ పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అందిస్తే మరింత ఉత్తేజంతో పనిచేస్తారు. వారి అవసరాలను సకాలంలో తీర్చుకుంటారు. దీని వల్ల పనిలో వేగం పెరుగుతుంది. పెండింగ్ బిల్లులను సత్వరమే చెల్లించాలి. – డాక్టర్ జలగం తిరుపతిరావు, ప్రొఫెసర్

ఎమ్మెల్సీ ఎన్నికకు అన్ని జాగ్రత్తలు తీసుకోవాలి



బోధన్‌లో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు
- బోధన్ ప్రభుత్వ జూనియర్ కాలేజీలో పోలింగ్ కేంద్రాల పరిశీలన
- మౌలిక వసతులు కల్పించాలని ఆదేశాలు

బోధన్: శాసన మండలి ఉపాధ్యాయ, పట్ట భద్రుల నియోజకవర్గాల పోలింగ్ ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు అన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులకు సూచించారు. ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో బోధన్ పట్టణ కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఉపాధ్యాయ, పట్టభద్రులకు వేర్వేరుగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను మంగళవారం కలెక్టర్ హనుమంతు సందర్శించారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ వికాస్ మహతో ఉన్నారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల సంఖ్యను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల్లో అందుబాటులో ఉన్న మౌలిక సౌకర్యాలను పరిశీలించారు.పోలింగ్ ప్రక్రియకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మౌలిక సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఓటర్లు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలని పేర్కొన్నారు.తహసీల్దార్ విఠల్, అధికారులు పాల్గొన్నారు.

కోళ్ల మృత్యువాత

- ఆందోళనలో పౌల్ట్రీ నిర్వాహకులు
- బర్డ్ ఫ్లూ వైరస్ సోకినట్లు అనుమానం
- వేల్పూర్‌లో కోళ్ల రక్త నమూనాలను సేకరించిన అధికారులు



పోతంగల్ మండలం చేతన్‌నగర్‌లోని కోళ్ల ఫామ్‌లో మృతి చెందిన కోళ్లు

రుద్రూర్/వేల్పూర్: పౌల్ట్రీ ఫామ్‌లలో కోళ్లు కుప్పలుకుప్పలుగా మృతి చెందుతున్నాయి. దీంతో పౌల్ట్రీ నిర్వాహకులు ఆందోళన చెందుతున్నారు. పోతంగల్ మండలం చేతన్‌నగర్ శివారులోని కోళ్ల ఫామ్‌లో గత రెండు రోజులుగా కోళ్లు మృత్యువాత పడుతున్నాయి. జల్లాపల్లికి చెందిన రవి చేతన్‌నగర్ శివారులో కోళ్ల ఫామ్‌ను లీజుకు తీసుకుని నడిపిస్తుండగా, సోమ, మంగళ వారాల్లో సుమారు 4,500 కోళ్లు మృతి చెందాయి. రూ.7లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు. బర్డ్ ఫ్లూతోనే కోళ్లు మృతి చెందుతున్నాయేమోనని అనుమానం వ్యక్తం చేశాడు. వేల్పూర్ మండలం లక్కోర గ్రామానికి చెందిన కొట్టాల గోవర్ధన్‌కు చెందిన పౌల్ట్రీఫామ్‌లో మంగళవారం 25 కోళ్లు మృతి చెందాయి. సమాచారం అందుకున్న అధికారులు పౌల్ట్రీఫామ్‌ను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. కోళ్ల నుంచి రక్త నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపించారు.

మరికొన్ని రోజులే..!

- ఈ నెల 19తో ముగియనున్న సొసైటీల పదవీ కాలం
- పొడగింపా.. ప్రత్యేకాధికారులను నియమిస్తారా..?
- త్వరలో రానున్న స్పష్టత

డొంకేశ్వర్(ఆర్మూర్): రైతులకు సేవలందిస్తున్న ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల పదవీ కాలం మరికొన్ని రోజుల్లో ముగియనుంది. ఐదేళ్ల పాటు కొనసాగిన పాలకవర్గాలు ఈ నెల 19తో దిగిపోనున్నాయి. మరో పదిహేను రోజులే మిగిలి ఉండడంతో ఇప్పుడున్న పాలకవర్గాలను కొనసాగిస్తారా? లేక ప్రత్యేక అధికారులను నియమిస్తారా? అనేది త్వరలో స్పష్టత రానున్నట్లు సహకార శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. జిల్లాలో మొత్తం 89 సొసైటీలు ఉండగా ఇందులో 2.70 లక్షల మంది దాకా రైతులు సభ్యులుగా ఉన్నారు. ప్రతి సంఘానికి ఎన్నుకోబడిన పాలకవర్గాలు ఉన్నాయి. ప్రస్తుత నెలలో పాలకవర్గాల పదవీకాలం ముగుస్తుండగా, ఎన్నికలు నిర్వహించే పరిస్థితి మాత్రం కనిపించడం లేదు. అందుకు సంబంధించిన కసరత్తు కూడా ప్రభుత్వం చేయడం లేదు. తద్వారా ప్రస్తుతమున్న పాలకవర్గాల పదవీకాలాన్ని పొడగించే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. గతంలో కూడా సొసైటీల పదవీకాలాన్ని ప్రభుత్వాలు పొడగించిన సందర్భాలున్నాయి. ఒకవేళ ప్రత్యేక అధికారులను నియమించాల్సి వస్తే సహకార శాఖకు చెందిన ఆడిటర్లను, ఇతర ఉద్యోగులను నియమిస్తారు. సహకార శాఖకు సిబ్బంది కొరత ఉన్నందున ఒక్కొక్కరికి మూడు నుంచి ఐదు సొసైటీలను కేటాయించే అవకాశముంది.

కొత్త సొసైటీల ఏర్పాటు తర్వాతే..

రాష్ట్ర ప్రభుత్వం కొత్త సొసైటీల ఏర్పాటుకు కసరత్తు చేస్తోంది. కొత్త సొసైటీలు కావాలని రైతుల నుంచి డిమాండ్ కూడా ఉంది. జిల్లాలో ఇప్పటికే పదికి పైగా దరఖాస్తులు సహకార శాఖకు అందాయి. కొత్త సొసైటీలను ఏర్పాటు చేసిన తర్వాతే అన్నింటికీ కలిపి ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో జిల్లాలో సొసైటీల సంఖ్య 100 వరకు చేరే అవకాశముంది. సహకార శాఖకు కూడా ఓటరు జాబితాను సిద్ధం చేసుకుని ఎన్నికలకు వెళ్లడానికి ఆస్కారం ఉంటుంది.

పచ్చి పసుపు కొనుగోళ్లు

- కళ్లాల వద్దనే విక్రయిస్తున్న రైతులు
- క్వింటాల్‌కు రూ.10 వేలు వస్తున్న ధర
- ఉడికించి, ఆరబెట్టే శ్రమ తప్పుతోందంటున్న కర్షకులు



కుప్ప పోసిన పచ్చి పసుపు

బాల్కొండ: మార్కెట్‌లో పసుపునకు డిమాండ్ ఏర్పడటంతో వ్యాపారులు వ్యవసాయ భూముల్లోని కళ్లాల వద్దకే వచ్చి పచ్చి పసుపును డ్రమ్ముల చొప్పున కొనుగోలు చేస్తున్నారు. ప్రస్తుత సంవత్సరం పసుపు పంటకు క్వింటాల్‌కు రూ. 10 వేలకు తగ్గకుండా ధర పలుకుతోంది. పచ్చి పసుపును విక్రయించినా మార్కెట్‌లో పలికిన ధర వస్తోందని రైతులు చెబుతున్నారు. సాధారణంగా పసుపు పంటను యంత్రాల ద్వారా ఉడికించి, ఆరబెట్టిన తరువాత శుద్ధి చేసి మార్కెట్‌కు తరలిస్తారు. ఇప్పుడు అలాంటి పరిస్థితి అవసరం లేకుండానే వ్యాపారులు నేరుగా పచ్చి పసుపును కొనుగోలు చేస్తున్నారు. దీంతో రైతులకు ఉడికించి, ఆరబెట్టి, శుద్ధి చేసే తిప్పలు తప్పుతున్నాయి. పచ్చి పసుపును కుప్పగా కళ్లం వద్ద పోసి ఉంచితే వ్యాపారులే తమ ఖర్చులతో ఉడికించుకుని ఆరబెట్టుకుంటున్నారు. ప్రస్తుతం తవ్విన పచ్చి పసుపును ఉడికించి ఆరబెట్టిన తరువాత డ్రమ్ముకు 55 నుంచి 60 కిలోల బరువు వస్తోందని రైతులు అంటున్నారు. అంటే 60 కిలోల పసుపునకు రూ. 5,700 నుంచి రూ. 6 వేల ధర పలుకుతోంది. ఈ లెక్కన చూసుకున్నా క్వింటాల్‌కు రూ.10 వేల పైనే ధర వస్తోందని రైతులు చెబుతున్నారు. ఉడికించి, ఆరబెట్టి శుద్ధి చేయడానికి క్వింటాల్‌కు కనీసం రూ. 600 నుంచి రూ. 800 ఖర్చు అవుతుంది. ఉడికించిన పసుపును 15 రోజులు కళ్లాల్లో ఆరబెట్టాలి. పచ్చి పసుపును వ్యాపారులు కొనుగోలు చేయడం వలన రైతులకు ఖర్చులు, శ్రమ తప్పుతోంది. ముప్కాల్, మెండోరా మండలాల పరిధిలో నిత్యం పచ్చి పసుపును వ్యాపారులకు రైతులు విక్రయిస్తున్నారు.

మార్కెట్ ధరనే వస్తోంది



పచ్చి పసుపును అమ్ముకున్నా మార్కెట్‌లో అమ్మితే వచ్చే ధరనే వస్తోంది. దీంతో పచ్చి పసుపును అమ్ముతున్నాం. దీని వలన ఉడికించి శుద్ధి చేసే శ్రమ, ఖర్చు తప్పుతుంది. ఇతర వ్యవసాయ పనులు చేసుకోవచ్చు. వ్యాపారుల వద్ద నుంచి నగదును వెంటనే తీసుకుంటున్నాం. – ఆకుల రాజేశ్వర్, రైతు

క్లుప్తంగా

'కులం నుంచి బహిష్కరించి వేధిస్తున్నారు'



కామారెడ్డి టౌన్: తమను కులం నుంచి బహిష్కరించి వేధింపులకు గురి చేస్తున్నారని తాడ్వాయి మండల కేంద్రానికి చెందిన తండ్రీ కొడుకులు సుర్కంటి రాంరెడ్డి, ప్రకాశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో వారు మాట్లాడారు. తమ బంధువులతో 2023 డిసెంబర్‌లో గొడవ కావడంతో రెడ్డి సంఘంలో పంచాయితీ పెట్టారని, ఆ పంచాయితీకి తాము వెళ్లకపోవడంతో రూ.5 వేలు కట్టాలని అడగడంతో తాము చెల్లించలేదన్నారు. దీంతో తమను కులం నుంచి బహిష్కరించి 13 నెలలుగా శుభకార్యాలకు, ఇతర కార్యక్రమాలకు పిలవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినా కులసంఘ సభ్యులు వినడం లేదని, తమకు న్యాయం చేయాలని కోరారు.

కోడ్ ఎఫెక్ట్



ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో అధికారులు జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్, రాజీవ్‌గాంధీ, ఇందిరాగాంధీ విగ్రహాలకు ముసుగులు వేశారు. కోడ్ అమలులోకి వచ్చిన మూడు రోజుల తరువాత మేల్కొన్న అధికారులు మంగళవారం విగ్రహాలకు ముసుగు కప్పడం గమనార్హం.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, నిజామాబాద్

ప్రభుత్వ పాఠశాలలో ప్రైవేట్ వ్యక్తులు

- ఖలీల్‌వాడి ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాలలో ఇష్టారాజ్యం
- రోజుల తరబడి స్కూల్ ముఖం చూడని హెచ్‌ఎం, రెగ్యులర్ టీచర్లు
- పెత్తనమంతా అనధికారిక వ్యక్తులదే..
- మధ్యాహ్న భోజనంలో రాజ్యమేలుతున్న అవినీతి



అర్సపల్లిలో ఉన్న ఖలీల్‌వాడి ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల



విద్యార్థులందరూ భోజనం చేసినట్లు పాఠశాల హెచ్‌ఎం ఇచ్చిన నెలవారీ నివేదిక

నిజామాబాద్ అర్బన్: పర్యవేక్షణ లేక ఉర్దూ మీడియం పాఠశాలలు గాడి తప్పుతున్నాయి. టీచర్ల విద్యాబోధన ఇష్టానుసారంగా మారింది. సగం మంది టీచర్లు పాఠశాలలకు వెళ్లకపోయినా పట్టించుకునే వారు కరువయ్యారు. నగరంలోని ఖలీల్‌వాడి ఉర్దూ మీడియం ప్రాథమిక పాఠశాల పరిస్థితి ఈ పరిస్థితికి అద్దం పడుతోంది. రెగ్యులర్ టీచర్లు, హెచ్‌ఎంలు సహా ఎవరూ పాఠశాలలకు వెళ్లడం లేదు. వారి స్థానంలో అనధికారికంగా రిటైర్డ్ టీచర్లు పనిచేస్తున్నారు. విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు నిదర్శనం.

జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో కొనసాగుతున్న ఖలీల్‌వాడి ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పనితీరును పరిశీలిస్తే, ఉర్దూ మాధ్యమ బడుల పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో ఇట్టే తెలిసిపోతోంది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కొనసాగుతున్న ఈ పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 300పైగా ఉంది. అయితే బోధన తీరుతోపాటు నిర్వహణను అధికారులు పట్టించుకోకపోవడం, విద్యార్థుల హాజరును సైతం పర్యవేక్షించే వారు కరువవడంతో ప్రతిరోజూ సగం మందికిపైగా విద్యార్థినీవిద్యార్థులు స్కూల్ కు రావడం లేదు. అసలు ఈ పాఠశాలకు చెందిన హెచ్‌ఎంతోపాటు నలుగురు రెగ్యులర్ ఉపాధ్యాయులే రోజుల తరబడి విధులకు హాజరుకాకుండా దుమ్మా కొడుతుండడంతో తమ పిల్లలను బడికి పంపించి ప్రయోజనం ఏమిటని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రార్థన సమయానికే హెచ్‌ఎం సహా ఉపాధ్యాయులందరూ విధుల్లో ఉండాలని నిబంధనలున్నా ఏరోజు కూడా వారి జాడ కనిపించడం లేదని స్థానికులు అంటున్నారు. ఉపాధ్యాయ శిక్షణ పొందుతున్న ప్రభుత్వ డైట్ కళాశాలతోపాటు ఆయేషా బీఈడీ కాలేజీకి చెందిన వారు తమ శిక్షణలో భాగంగా ఈ పాఠశాలలో 80 రోజుల పాటు విద్యార్థులకు పాఠాలు బోధిస్తుంటారు.

మధ్యాహ్న భోజనంలో అవినీతి

సంగం మందికిపైగా విద్యార్థులు బడికి దుమ్మా కొడుతున్నప్పటికీ మధ్యాహ్న భోజనం బిల్లుల్లో మాత్రం ప్రతిరోజూ పూర్తి స్థాయిలో విద్యార్థులు భోజనం చేసినట్లుగా చూపుతున్నారు. ఈ బడిలో ప్రతిరోజూ 300 మందికి పైగా మంది విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తున్నట్లుగా రికార్డుల్లో చూపుతూ నెలనెలా పెద్ద మొత్తంలో బిల్లులు స్వాహా చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ప్రతిరోజూ కనీసం వంద మంది విద్యార్థులకు కూడా సరిపడే స్థాయిలో భోజనం వండడం లేదని, అది కూడా నాసిరకంగా, నాణ్యత లేని భోజనాన్ని మొక్కుబడిగా పెడుతూ నిధులను మింగేస్తున్నారని తల్లిదండ్రులు మండిపడుతున్నారు. కలెక్టర్ స్పందించి పకడ్బందీగా విచారణ చేయిస్తే ఖలీల్‌వాడి ఉర్దూ మీడియం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలోని లొసుగులు వెలుగుచూడడం ఖాయమని అంటున్నారు.

విచారణ చేపడతాం

ఖలీల్‌వాడి పాఠశాలపై విచారణ చేపడుతాం. టీచర్లు గైర్హాజరైతే చర్యలు తీసుకుంటాం. ప్రైవేట్ వ్యక్తులు పాఠశాలలో ఉంటే తక్షణమే విచారణ చేయించి చర్యలు తీసుకుంటాం. ఆరోపణలు వస్తున్న పాఠశాలలను అధికారులు సందర్శించి విచారణ చేపడతారు.

– అశోక్, జిల్లా విద్యాశాఖ అధికారి

భారతీయ విద్యార్థులకు షాకే..

- ట్రంప్ నిర్ణయాలపై తీవ్ర వ్యతిరేకత
- అప్పులు చేసి అమెరికా వెళ్లిన వారికి ఊహించని దెబ్బ!



నిజామాబాద్ సిటీ/నిజామాబాద్ అర్బన్/నిజామాబాద్ నాగారం: భవిష్యత్‌పై ఎన్నో ఆశలతో అమెరికా వెళ్లిన వారు ట్రంప్ నిర్ణయాలతో ఆందోళన చెందుతున్నారు. అక్కడ ఉద్యోగులు చేస్తున్న, మాస్టర్స్ పూర్తి చేసిన వారు తమ పరిస్థితి ఏమిటని అంటున్నారు. తమ పిల్లలు అమెరికా వెళ్లేందుకు అప్పులు చేశామని, బ్యాంక్ లోన్‌లు తీసుకున్నామని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రంప్ నిర్ణయాలు ఊహించని దెబ్బ అని, కేంద్ర ప్రభుత్వం స్పందించి భారతీయులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

దేశాలు అంగీకరించవు



నా కుమారుడు అమెరికాలో మాస్టర్స్ చేశాడు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో పదేళ్లగా ఉద్యోగం చేస్తున్నాడు. మేధస్సు ఎవరి సొత్తు కాదు. భారతీయ విద్యార్థులను ఆపడం ఎవరితరం కాదు. ఈ గ్లోబలైజేషన్‌లో ఎవరు ఎక్కడైనా ఉద్యోగాలు చేసుకోవచ్చు. బలవంతపు నిరాకరణ సరికాదు. ప్రపంచ దేశాలు ట్రంప్ నిర్ణయాన్ని అంగీకరించవు.

– గంగాధర్, విశ్రాంత అధ్యాపకుడు, కంఠేశ్వర్

ట్రంప్ నిర్ణయం కోర్టుల్లో చెల్లదు



నా కుమార్తె లాస్‌ఏంజెల్స్‌లో ఉద్యోగం చేస్తోంది. కొన్నేళ్లుగా సాఫ్ట్‌వేర్ డెవలర్‌గా టీమ్‌ను లీడ్ చేస్తోంది. ట్రంప్ తీసుకున్న నిర్ణయం దిగ్భ్రాంతికి గురిచేసింది. అయినా ఆయన నిర్ణయం కోర్టుల్లో చెల్లదు. అమెరికాలోని బిజినెస్‌మెన్‌లే ముందుగా వ్యతిరేకిస్తారు. అమెరికేతర సాఫ్టవేర్ నిపుణులతోనే అక్కడి కంపెనీలు నడుస్తున్నాయి.

– రాజేంద్రకుమార్, డిప్యూటీ కమిషనర్


ఇబ్బందులు తప్పవు



ప్రస్తుత గ్లోబలైజేషన్ యుగంలో ఎవరు ఎక్కడైనా వెళ్లొచ్చు, ఏ దేశంలోనైనా పని చేసుకోవచ్చు. ఒకే దేశంలో పని చేయాలని ఏం లేదు. ఆసియా దేశాల కారణంగా అమెరికా ఎకనామీ పెరుగుతుంది. చాలా మంది స్టూడెంట్ వీసా, ఎస్‌బీ – 1 వీసాపై వెళ్లి అక్కడ సెటిల్ అయ్యారు. కొంతమంది లీగల్‌గా ఉన్నా వారికి కూడా భవిష్యత్‌లో ఇబ్బందులు తప్పవు.

– జలగం తిరుపతిరావు, ప్రొఫెసర్, జనరల్ మెడిసిన్

విద్యార్థులకు న్యాయం చేయాలి



మన విదేశాంగశాఖ మంత్రి, ప్రధాని మోదీ దౌత్యపరమైన నిర్ణయాలతో అమెరికాలో విద్యార్థులకు ఇబ్బందులు కలగకుండా న్యాయం చేయాలి. మేక్ ఇన్ ఇండియా, మేడిన్ ఇండియాను దృష్టిలో పెట్టుకొని దేశ ఆర్థికాభివృద్ధిలో విద్యార్థులు భాగస్వాములయ్యేలా ఆలోచన చేయాలి. ట్రంప్ నిర్ణయంతో అమెరికాలో ఉన్న ప్రతి ఒక్కరికీ నష్టం జరుగుతుంది.

– కెంపుల నాగరాజు, జిల్లా అధ్యక్షుడు, తెలంగాణ ఎంప్లాయిస్ అసోసియేషన్

ట్రంప్ నిర్ణయాలు సరైనవి కావు..



అమెరికా అధ్యక్షుడు ట్రంప్ నిర్ణయాలు సరైనవి కావు. భారతీయులకు ఇబ్బందికరమైనవి. విద్యార్థులకు గతంలో కొనసాగిన విధానాలనే కొనసాగించాలి. ట్రంప్ తన నిర్ణయాలను వెనక్కి తీసుకోవాలి. అమెరికాలో భారతీయులకు గతంలో ఉన్న విధివిధానాలనే కొనసాగిస్తూ నిర్ణయాలు అమలు చేయాలి.

– లాల్‌సింగ్, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్, తెలంగాణ విద్యార్థి ఉద్యమ వేదిక

ప్రభుత్వం స్పందించాలి



భారత ప్రభుత్వం అమెరికా నుంచి తిరిగి వచ్చినవారికి న్యాయం చేయాలి. అలాగే అమెరికా అమలు చేస్తున్న నూతన విధివిధానాలపై ఆ దేశంతో మాట్లాడాలి. భారతీయులకు నష్టం జరుగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ట్రంప్ నిర్ణయాలు సరైనవికావు.

– రఘురాం, ఏఐఎస్ఎఫ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు

నెలాఖరులోపు పెండింగ్ పనులు పూర్తి చేయాలి

- అధికారులను ఆదేశించిన ఎన్‌పీడీసీఎల్ ఎస్ఈ రాపల్లి రవీందర్



మాట్లాడుతున్న ఎస్ఈ రాపల్లి రవీందర్

సుభాష్‌నగర్: వేసవిలో విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను నిరంతరాయంగా అందించడానికి ఎన్‌పీడీసీఎల్ ఆధ్వర్యంలో చేపడుతున్న పెండింగ్ పనులు ఈనెలాఖరులోపు పూర్తి చేయాలని ఎస్ఈ రాపల్లి రవీందర్ సూచించారు. మంగళవారం నగరంలోని పవర్‌హౌజ్‌లో వేసవిలో విద్యుత్ సరఫరాకు ముందస్తు జాగ్రత్తలపై డీఈలు, ఏడీఈలు, ఏఈలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రాపల్లి రవీందర్ మాట్లాడుతూ జిల్లాలో రూ.6 కోట్ల వ్యయంతో ఆరు పవర్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశామని తెలిపారు. రూ.13.1 కోట్లతో 33 కేవీ ఇంటర్ లింకింగ్ లైన్లు 40 మంజూరయ్యాయని, వాటి పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. అలాగే రూ.6.47 కోట్లతో డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్స్ స్థాయి పెంపు, అదనపు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నామని పేర్కొన్నారు. నిజామాబాద్, బోధన్, ఆర్మూర్ పట్టణాల్లో ఓవర్ లోడ్ ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లకు అదనంగా ట్రాన్స్‌ఫార్మర్లను బిగించామన్నారు. రూ.5 కోట్ల వ్యయంతో కొత్త వీసీబీల ఏర్పాటుకు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. వేసవిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగకుండా వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ అందించడానికి సంసిద్ధంగా ఉన్నామన్నారు. పనులు వేగవంతం చేసి ఫిబ్రవరి చివరిలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో ఎస్ఏఓపీ శ్రీనివాస్, డీఈలు రమేష్, పీవీ రాజేశ్వర్‌రావు, ఎం శ్రీనివాస్, ఉత్తమ్ జాడే, ఎండీ ముక్తార్, డి వెంకటరమణ, ఏడీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి మృత్యు ఒడిలోకి..

నవీపేట: మండలంలోని కోస్లీ గ్రామానికి చెందిన మత్స్యకారుడు ఎడ్ల లింగన్న(52) చేపల వేటకు వెళ్లి మృతిచెందినట్లు ఎస్సై వినయ్ మంగళవారం తెలిపారు. గ్రామ శివారులోని కాసిరెడ్డి చెరువులో మంగళవారం ఉదయం చేపల వేటకు వెళ్లిన లింగన్న ఇంటికి తిరిగిరాకపోవడంతో కుటుంబ సభ్యులు చెరువు వద్దకు వెళ్లి వెతికారు. చివరకు లింగం మృతదేహం లభించింది. మృతుడి భార్య వసంత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రమాదవశాత్తు నీట మునిగి..

డిచ్‌పల్లి: ప్రమాదవశాత్తు చెరువు నీటిలో మునిగి మెంట్రాజ్‌పల్లికి చెందిన పశువుల కాపరి బాబయ్య(60) మృతి చెందినట్లు ఎస్సై మహ్మద్ షరీఫ్ మంగళవారం తెలిపారు. రోజూలాగే పశువులను మేపేందుకు వెళ్లిన బాబయ్య సోమవారం సాయంత్రం తిరిగి వస్తుండగా, ఓ గేదె చెరువు వైపు వెళ్లింది. దానిని బయటికి కొట్టే క్రమంలో బాబయ్య నీటిలో మునిగిపోగా మంగళవారం మృతదేహం లభించింది. మృతుడి భార్య సాయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రైలులో నుంచి పడి గుర్తు తెలియని వ్యక్తి..

ఇందల్వాయి: అకోలా నుంచి కాచిగూడ వెళ్తున్న ఇంటర్‌సిటీ ఎక్స్‌ప్రెస్‌లో నుంచి పడి మంగళవారం సాయంత్రం గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు ఇందల్‌వాయి ఎస్సై మనోజ్ తెలిపారు. ఈ ఘటన సిర్నాపల్లి – ఉప్పల్‌వాయి రైల్వే స్టేషన్‌ల మధ్య చోటు చేసుకుందని, రైల్వే పోలీసులకు సమాచారం అందించగా వారు మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారన్నారు. మృతుడి వయస్సు 60 ఏళ్ల ఉంటుందని తెలిపారు.

క్రైం కార్నర్

భార్యతో గొడవపడి ఆత్మహత్య


భిక్కనూరు: భార్యతో గొడవపడి ఉప్పు భూపతి(50)అనే వ్యక్తి మండలంలోని జంగంపల్లి చెరువులో దూకి ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. దోమకొండ మండలం లింగుపల్లికి చెందిన ఉప్పు భూపతి రెండేళ్లుగా జంగంపల్లిలోని అత్తగారింటిలో భార్యాపిల్లలతో కలిసి ఉంటున్నాడు. తాగుడికి బానిసగా మారిన భూపతి తరచూ భార్యతో గొడవపడేవాడు. సోమవారం రాత్రి కూడా భార్యాభర్తల మధ్య గొడవ జరగగా, భూపతి ఇంటినుంచి బయటకు వచ్చి స్థానిక చెరువులో దూకాడు. మంగళవారం చెరువులో మృతదేహం తేలడంతో గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. మృతుడి సోదరుడు యాదగిరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని ధర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

సీజ్ చేసిన ఇసుక వేలం



నస్రుల్లాబాద్(బాన్సువాడ): మండల కేంద్రంలోని తహసీల్ కార్యాలయంలో మంగళవారం ఇసుక బహిరంగ వేలం నిర్వహించారు. గత నెల 29వ తేదీన సీజ్ చేసిన ఇసుక టన్నుకు రూ.650 చొప్పున మొత్తం రూ.31,200 ప్రభుత్వ ధరగా తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ నిర్ణయించారు. నస్రుల్లాబాద్‌కు చెందిన మహేందర్ రూ.38500కు ఇసుకను కైవసం చేసుకున్నారు. వేలంలో నాయబ్ తహసీల్దార్ బావయ్య, గ్రామస్తులు కంది మల్లేశ్, జి నర్సింలుగౌడ్, మహేందర్‌గౌడ్, గణేశ్, శంకర్, గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఇసుక నిలువల సీజ్




రెంజల్(బోధన్): మండలంలోని నీల, బోధన్ మండలం కొప్పర్గ గ్రామాల శివార్లలో రోడ్ల పక్కన అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను మంగళవారం సీజ్ చేసినట్లు తహసీల్దార్ శ్రావణ్‌కుమార్ తెలిపారు. సుమారు 20 ట్రాక్టర్ల వరకు ఇసుక నిల్వలు ఉన్నాయని, సీజ్ చేసిన డంపుల వద్ద పోలీసు, రెవెన్యూ సిబ్బందిని నియమించామన్నారు. సీజ్ చేసిన ఇసుక నిల్వలను జిల్లా అధికారులు ఆదేశాల మేరకు బహిరంగా వేలం వేస్తామన్నారు. అంతకు ముందు గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని తహసీల్దార్ తనిఖీ చేశారు.

మూడు ట్రాక్టర్ల పట్టివేత..

రుద్రూర్: పొతంగల్ మండలంలోని మంజీరా నది నుంచి అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నట్లు కోటగిరి తహసీల్దార్ గంగాధర్ తెలిపారు. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారం అర్ధరాత్రి సమయంలో పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామన్నారు.

నందివాడలో బైక్ దగ్ధం



తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని నందివాడలో సోమవారం రాత్రి గుర్తుతెలియని వ్యక్తులు ప్యాషన్ ప్రో బైక్‌ను దగ్ధం చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామానికి చెందిన మాడి సత్యం తన బైక్‌ను రోజూలాగే సోమవారం రాత్రి తన ఇంటి ఎదుట పార్క్ చేసి పడుకున్నాడు. గుర్తుతెలియని వ్యక్తులు బైక్‌కు నిప్పంటించడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగాయి. నిద్రలోనుంచి మేలుకున్న సత్యం బయటికి వచ్చి చూసేసరికి బైక్ దగ్ధమవుతోంది. సత్యం కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి మంటలను ఆర్పివేశారు. ఈ ఘటనపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఏటీఎం మార్చి డబ్బులు విత్ డ్రా

- రైతును నమ్మించి మోసం
- రూ.10వేల చొప్పున మూడు విడతల్లో రూ.30వేలు కాజేత
- జిల్లా కేంద్రంలో ఐదు రోజుల క్రితం ఘటన



బస్టాండ్ ప్రాంతంలో సీసీ ఫుటేజీలో రికార్డు అయిన అనుమానితుడి కదలికలు

ఖలీల్‌వాడి: డబ్బులు డ్రా చేసేందుకు ఏటీఎంకు వచ్చిన రైతును నమ్మించి ఏటీఎం మార్చి అతడి అకౌంట్ నుంచి డబ్బులు విత్ డ్రా చేసిన ఘటన జిల్లా కేంద్రంలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. మోపాల్ మండలం నర్సింగ్‌పల్లికి చెందిన రైతు గంగారెడ్డి ఈనెల 1వ తేదీన నిజామాబాద్ నగరానికి వచ్చాడు. ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎస్‌బీఐ ప్రధాన కార్యాలయం వద్ద ఉన్న ఏటీఎంకు వెళ్లి రూ.5వేలు విత్ డ్రా చేయగా కార్డు మిషన్‌లో చిక్కింది. అక్కడే ఉన్న వ్యక్తి సాయం చేస్తానని వచ్చి పిన్ నంబర్ అడిగి కార్డు తీసినట్లు నమ్మించి మరో కార్డును రైతు చేతిలో పెట్టాడు. అక్కడి నుంచి రైతు వెళ్లిపోగానే రూ.10వేల చొప్పున మూడు విడతల్లో రూ.30వేలు అతడి అకౌంట్ నుంచి విత్ డ్రా చేశాడు. డబ్బులు విత్ డ్రా చేసినట్లు తన ఫోన్‌కు మెసేజ్‌లు రావడంతో అనుమానించిన రైతు గంగారెడ్డి నర్సింగ్‌పల్లిలోని ఎస్బీఐకి వెళ్లి విషయం తెలిపాడు. ఏటీఎం కార్డును బ్యాంకు అధికారులకు చూపగా అది అతడిది కాదని చెప్పడంతో ఖంగుతిన్నాడు. వెంటనే ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని పోలీసులకు విషయం తెలుపగా, పోలీసులు ఎస్బీఐ ప్రధాన ఆఫీస్‌కు వెళ్లి ఏటీఎం నుంచి డబ్బులు విత్ డ్రా చేసిన వ్యక్తిని గుర్తించారు. సదరు వ్యక్తి ఇంటికి వెళ్లి ప్రశ్నించగా అందుబాటులో లేడని సమాధానం వచ్చింది. దీంతో బాధితుడు మంగళవారం ఒకటో టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రాతపూర్వకంగా ఫిర్యాదు చేశాడు.

ఏటీఎంలలో జాగ్రత్తగా ఉండాలి

ఏటీఎం సెంటర్ వద్ద డబ్బులు విత్ డ్రా చేసే సమయంలో జాగ్రత్తగా ఉండాలని ఒకటో టౌన్ ఎస్‌హెచ్‌వో రఘుపతి సూచించారు. డబ్బులు విత్ డ్రా చేసేందుకు వచ్చిన వారిని నమ్మించి కార్డులు మార్చి డబ్బులు విత్ డ్రా చేస్తున్నట్లు భావిస్తున్న వ్యక్తి కదలికలు బస్టాండ్ ప్రాంతంలో సీసీ ఫుటేజీలో రికార్డు అయ్యాయని వెల్లడించారు. సదరు వ్యక్తిని గుర్తించిన వారు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్‌లో లేదా ఎస్‌హెచ్‌వో (87126 59837)కు సమాచారం అందించాలని కోరారు.

గంజాయి విక్రేతల అరెస్ట్

కామారెడ్డి క్రైం: జిల్లా కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న ఇద్దరిని పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. భూపుత్రమ్మ కల్యాణ మండపం సమీపంలో గంజాయి విక్రయిస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు నిఘాసారించి ఇద్దరిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా వారి వద్ద 380 గ్రాముల గంజాయి పట్టుబడింది. నిందితులను పట్టణంలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన మహమ్మద్ ఇమ్రాన్, షేక్ అన్వర్‌గా గుర్తించారు. హైదరాబాద్ నుంచి గంజాయి తీసుకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నారని పట్టణ ఎస్‌హెచ్‌వో చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపర్చామన్నారు. ఇమ్రాన్ గతంలో పలు చోరీలు, గొడవల కేసుల్లో జైలుకు వెళ్లి వచ్చాడు.

బైకుతో ఢీకొట్టిన వ్యక్తిపై కేసు..

ఎల్లారెడ్డి: బైకును నిర్లక్ష్యంగా నడిపి మరో బైక్‌ను ఢీకొట్టిన యువకుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై మహేశ్ మంగళవారం తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని సోమర్యాగడి తండాకు చెందిన దేవసోత్ శివరాం తన గ్రామం నుంచి ఎల్లారెడ్డికి వస్తుండగా భిక్కనూర్ నుంచి ఎల్లారెడ్డి వైపునకు బైక్‌పై వెళ్తున్న రాజు ఢీకొట్టాడు. ఈ ఘటనలో శివరాంకు తీవ్రగాయాలయ్యాయి. శివరాం తల్లి జీరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ట్రాక్టర్ బోల్తా : ఎనిమిది మందికి గాయాలు

- అంత్యక్రియలకు కట్టెలు తీసుకెళ్తుండగా ఘటన



ఘటనాస్థలంలో బోల్తాపడిన ట్రాక్టర్

భిక్కనూరు: మండలంలోని కాచాపూర్‌లో ఓ వ్యక్తి అంత్యక్రియలకు అవసరమైన కట్టెలను తీసుకెళ్తుండగా ట్రాక్టర్ బోల్తాపడి ఎనిమిది మందికి తీవ్రగాయాలయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి.. చింతల నర్సయ్య అనే వ్యక్తి మృతి చెందగా ఆయన అంత్యక్రియలకు అవసరమైన కట్టెలను తీసుకువచ్చేందుకు పలువురు ట్రాక్టర్‌లో పెద్దమల్లారెడ్డికి వెళ్లారు. కట్టెలు కొనుగోలు చేసి తీసుకువెళ్తుండగా పెద్దమల్లారెడ్డి బీరప్ప గుడి సమీపంలోని వేపచెట్టు వద్దకు రాగానే డ్రైవర్ సడెన్ బ్రేక్ వేయడంతో ట్రాక్టర్ ట్రాలీ బోల్తా పడింది. ట్రాలీలో కూర్చున్న ఫిరంగి రాజు, బండారి రాజయ్య, కొండమడుగు రాజయ్య, బండారి నర్సింలు, బండారి నాగరాజు, బండారి రాజేందర్, ఇరుకోడి నర్సింలు, కొండమడుగు లింగం అనే వ్యక్తులకు తీవ్రగాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

వేర్వేరు కేసుల్లో పలువురికి జైలు శిక్ష

ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పటుబడిన వ్యక్తికి న్యాయస్థానం రెండు రోజుల జైలు శిక్ష విధించినట్లు ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌వో బి రఘుపతి మంగళవారం తెలిపారు. గత నెల 29వ తేదీన నగరంలోని గాంధీచౌక్‌లో వాహనాలు తనిఖీ చేస్తుండగా ముస్తాయిపురాకు చెందిన ఓ వ్యక్తి మద్యం సేవించి వాహనం నడుపుతూ పట్టుబడ్డాడని అన్నారు. సదరు వ్యక్తిని మంగళవారం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ నూర్జహాన్ ఎదుట హాజరు పర్చగా రెండు రోజుల జైలు శిక్ష విధించారని తెలిపారు. అలాగే నగరంలో అర్ధరాత్రి వరకు హోటళ్లు తెరిచి ఉంచిన షేక్ అబ్బు, సమీర్‌తోపాటు స్నూకర్ నిర్వాహకుడు మహ్మద్ షాకీర్ హుస్సేన్‌కు ఒక రోజు చొప్పున జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌వో వివరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో..

నవీపేట: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో మండలంలోని గాంధీనగర్‌కు చెందిన వ్యక్తికి న్యాయస్థానం మూడు రోజుల జైలు శిక్ష విధించినట్లు పోలీసులు తెలిపారు.

చిరుత దాడిలో దూడ మృతి

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బోనాల్, బంజారా తండా శివార్లలోని పంట చేను వద్ద మంగళవారం తెల్లవారు జామున పాడిదూడపై చిరుత దాడి చేసింది. తండాకు చెందిన బర్మావత్ దరియా తన పంట చేను వద్ద పాడిదూడను కట్టేసి వెళ్లగా, చిరుత దాడి చేసి హతమార్చింది. అటవీ శాఖ అధికారులు ఘటనాస్థలానికి చేరుకొని పశువైద్యాధికారితో పంచనామా నిర్వహించారు. ఈ ఘటనతో పంటపొలాల వైపు వెళ్లే రైతులు భయాందోళనకు గురవుతున్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఆర్మూర్‌టౌన్: పట్టణంలోని ఓ తోటలో కొనసాగుతున్న పేకాటస్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడి చేశారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ అంజయ్య , సీసీఎస్ సిబ్బంది పేకాటస్థావరంపై దాడి చేసి ఆరుగురిని అదుపులో తీసుకున్నారు. పట్టుబడిన వారి నుంచి రూ.21,960 నగదుతోపాటు ఐదు వాహనాలు, నాలుగు ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌హెచ్‌వో సత్యనారాయణ తెలిపారు.

ఒకరి బైండోవర్

నిజాంసాగర్(జుక్కల్): డయల్ 100కు తరచూ ఫోన్ చేస్తూ అత్యవసర సేవలను దుర్వినియోగం చేసిన వ్యక్తిని మహమ్మద్‌నగర్ తహసీల్దార్ సవాయిసింగ్ ఎదుట మంగళవారం బైండోవర్ చేసినట్లు ఎస్సై శివకుమార్ తెలిపారు. గాలీపూర్ గ్రామానికి చెందిన టెక్కలి నాగరాజు సోమవారం రాత్రి మద్యం సేవించి డయల్ 100కు ఫోన్ చేశాడన్నారు. పోలీసులు అక్కడి వెళ్లగా నాగరాజు మద్యం సేవిస్తూ ఉండటంతో కేసు నమోదు చేశామన్నారు.